# 'నయన జ్యోతి' తో విద్యార్థులకు కంటిసమస్య పరిష్కారం



ఉపాధ్యాయురాలికి నయనజ్యోతి బుక్‌లెట్‌ను అందజేస్తున్న కలెక్టర్

విద్యార్థులకు చిన్నతనంలోనే పోషకాహార లోపంతో దృష్టిలోప సమస్యలు ఏర్పడుతుండడంతో.. 'నయన జ్యోతి' కార్యక్రమం ద్వారా దృష్టిలోపాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ భారతి హోళికేరి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చిన్నారుల చూపుకు చేయూతలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు అవగాహన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ తరగతి గదిలో వెనక వరుసలో ఉన్న విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఉన్నా.. బోర్డుపై ఉపాధ్యాయుడు రాసే అక్షరాలను గుర్తించక చదువులో వెనకబడుతుంటారు. ఆ విద్యార్థులను గుర్తించి వారిలో ఉన్న లోపాన్ని సరిదిద్దేందుకు నయనజ్యోతి తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని 6 నుంచి 10వ తరగతి చదివే 50 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన విద్యార్థులకు శస్త్రచికిత్సలు సైతం జరుపుతామని తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన 'అఖిల కంటి ఆస్పత్రి' వైద్యుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కంటి పరీక్షలే కాకుండా రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

## 200 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడి పర్యవేక్షణ

ప్రతి 200 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడి పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ఇంట్లో తల్లిదండ్రుల కంటే ఉపాధ్యాయుల వద్దే ఎక్కువ సమయం గడుపుతారని.. ప్రతి విద్యార్థిని తమ పిల్లలుగా భావించి పరీక్షలు నిర్వహించినపుడే కార్యక్రమం విజయవంతమవుతుందని ఆకాంక్షించారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు జిల్లాలోని వంద పాఠశాలల్లో సులభతర బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. డ్రాపౌట్స్ శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ద్వారా బడిబయట పిల్లలను బడిలో చేర్పించినట్లు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ఉపాధ్యాయులు సహకరించి విద్యావ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.